ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -98 పేజీలు - 04 వెల - 04/- గురువారం 23 ఏప్రిల్ 2026

# కాల్పుల విరమణ పొడిగింపు!

**ఒప్పందం లేకపోతే బాంబుల మోత తప్పదు : ట్రంప్**

**మళ్లీ యుద్ధం మొదలైతే చమురు పరిశ్రమను దెబ్బతీస్తాం : ఐఆర్‌జిసి హెచ్చరిక- చర్చల కోసం పాక్ తిప్పలు**

**హార్ముజ్‌లో నౌకలను అడ్డుకున్న ఇరాన్ గార్డ్స్**



**వాషింగ్టన్, టెహ్రాన్ :** ఇరాన్‌తో కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. బుధవారంతో రెండు వారాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో, మరో దఫా చర్చలు జరగాల్సి వున్న తరుణంలో మంగళవారం ఈ మేరకు ప్రకటన చేశారు. అయితే దీనిపై ఇరాన్ ఇంకా స్పందించాల్సి వుంది. **మిగతా 2లో...**

# భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు



**పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసింది: ప్రధాని నరేంద్రమోదీ**

**పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది -ఎక్స్ వేదికగా నివాళులర్పించిన ప్రధాని మోదీ**

**ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎప్పటికీ మరిచిపోలేమన్న మోదీ**

**ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈ విషాదాన్ని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారిని ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన నివాళులర్పించారు. **మిగతా 2లో...**

# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

**తమిళనాడు, బెంగాల్‌లో ఏర్పాట్లు పూర్తి**

**భద్రత కట్టుదిట్టం మే 4న ఫలితాలు**



**న్యూఢిల్లీ : ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**


దేశంలో ఎంతో ఉత్కంఠను రేపుతున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు నేడు (గురువారం) జరగనున్నాయి. ఇందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రజలు ఓటు హక్కు ద్వారా వివిధ పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు నేడు ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. **మిగతా 2లో...**

# పీపీపీ మెడికల్ కాలేజీలు..నెలలో పట్టాలెక్కాలి..



**ఫేజ్-1లో నాలుగు ప్రారంభించండి**

**హెల్త్ పాలసీని సిద్ధం చేయండి: చంద్రబాబు**



**అమరావతి, ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీల పనులను నెల రోజుల్లో ప్రారంభించేలా ఆయా సంస్థలకు అప్పగించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం సంజీవని ప్రాజెక్టు, పాపులేషన్ మేనేజ్మెంట్‌పై ఆయన సమీక్షించారు. **మిగతా 2లో...**



# మాజీ సీఎం నాదెండ్ల కన్నుమూత..

**వృద్ధాప్య సమస్యలతో నాదెండ్ల భాస్కరరావు**

**హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో కన్నుమూత**

**నేడు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు**

**1984లో నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల**

**నాదెండ్ల వయసు 90 సంవత్సరాలు**

**హైదరాబాద్ ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్న నాదెండ్ల... కాసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడే ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆయన అంత్యక్రియలను పంజాగుట్ట శ్మశానవాటికలో రేపు సాయంత్రం 4 గంటలకు **మిగతా 2లో...**



# తెరుచుకున్న కేదార్‌నాథ్ తలుపులు..

**ఆలయానికి పోటెత్తుతున్న భక్తులు**

**అందరి యాత్ర సుఖమయంగా సాగాలని ఆకాంక్షించిన మోదీ**

**ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

ఆధ్యాత్మిక ప్రపంచంలో నేడు ఒక పవిత్ర ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత పవిత్రమైన శ్రీ కేదార్‌నాథ్ ధామం తలుపులు నేడు భక్తుల దర్శనార్థం తెరుచుకున్నాయి. **మిగతా 2లో...**



# సింగపూర్ హోం మంత్రితో ఏపీ మంత్రుల భేటీ..

**రెండో రోజు కొనసాగుతున్న ఏపీ మంత్రుల సింగపూర్ పర్యటన**

**సింగపూర్ హోం మంత్రి షణ్ముగంతో మంత్రుల భేటీ**

**పోలీసు వ్యవస్థ పనితీరును అడిగి తెలుసుకున్న మంత్రులు**

**అమరావతి, ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం సింగపూర్ పర్యటన రెండో రోజు అత్యంత కీలకమైన భేటీలతో కొనసాగుతోంది. రాష్ట్ర మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్‌లు, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ సింగపూర్ హోం మంత్రి కె.షణ్ముగంతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు.

సింగపూర్‌లో నేరాల శాతం తక్కువగా ఉండటానికి కారణమైన కఠిన చట్టాలు, పోలీసు వ్యవస్థ పనితీరును మంత్రులు అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణ కోసం సింగపూర్ ఉపయోగిస్తున్న టెక్నాలజీ ఆధారిత నిఘా వ్యవస్థపై హోం**మిగతా 2లో...**

# ఎలాంటి చర్యలొద్దు



**కాళేశ్వరం కేసు.. కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట**




**విచారణ కమిషన్ చట్టంలోని నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టీకరణ**

**కేసీఆర్, హరీశ్‌తో పాటు ఇద్దరు ఐఏఎస్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు తీర్పు**

**హైదరాబాద్ ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. **మిగతా 2లో...**

# ప్రాసిక్యూషన్‌కు అనుమతించండి

**ధనుంజయ రెడ్డి, వాసుదేవ రెడ్డి ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరుతూ సిట్ లేఖలు**

**లిక్కర్ కేసులో ఏ2 వాసుదేవ రెడ్డి, ఏ31 ధనుంజయ రెడ్డి**

**వీరిని ప్రాసిక్యూట్ చేసేందుకు డీఓపీటీ, ఐఆర్‌టీఎస్ కు సిట్ లేఖలు**

**ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న నిందితులు**



# ఖాళీ స్థలాలపై పన్ను రాయితీ

**ఏపీలో ఇళ్ల నిర్మాణదారులకు ఊరట..**

**వీఎల్‌టీపై 50 శాతం రాయితీ**

**నిర్మాణ అనుమతి నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వరకు తగ్గింపు వర్తింపు**

**అక్రమ నిర్మాణాలకు ఈ పన్ను తగ్గింపు వర్తించదని స్పష్టీకరణ**



**అమరావతి, ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

ఏపీలో ఇళ్లు, భవనాలు నిర్మించుకోవాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. నిర్మాణ సమయంలో ఖాళీ స్థలాలపై విధించే పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్–వీఎల్‌టీ)ను 50 శాతం తగ్గిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నగరాలు**మిగతా 2లో...**

# ప్రాసిక్యూషన్‌కు అనుమతించండి

**ధనుంజయ రెడ్డి, వాసుదేవ రెడ్డి ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరుతూ సిట్ లేఖలు**

**ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**

ఏపీ మద్యం కుంభకోణం కేసు విచారణ ఇప్పుడు మరో కీలక దశకు చేరుకుంది. గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన ఇద్దరు కీలక అధికారులపై న్యాయ విచారణ జరిపేందుకు సిట్ వేగంగా అడుగులు వేస్తోంది. మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవ రెడ్డిలను ప్రాసిక్యూషన్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సంబంధిత విభాగాలకు సిట్ అధికారులు లేఖలు రాశారు. అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ప్రభుత్వ అధికారులపై న్యాయ విచారణ జరపాలంటే వారు పని చేసే విభాగాల నుంచి ముందస్తు అనుమతి అవసరం. ఈ నేపథ్యంలో ధనుంజయ రెడ్డి ప్రాసిక్యూషన్ కోసం డీఓపీటీకి, వాసుదేవ రెడ్డి కోసం ఐఆర్‌టీఎస్ కు సిట్ లేఖలు పంపింది. ఈ భారీ కుంభకోణంలో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డిని ఏ2 గా, అప్పటి సీఎంఓ కార్యదర్శి ధనుంజయ రెడ్డిని ఏ31 నిందితుడిగా సిట్ పేర్కొంది. గతంలోనే వీరిద్దరిని సిట్ అధికారులు అరెస్ట్ చేసి విచారించారు. ప్రస్తుతం వీరు బెయిల్‌పై బయట ఉన్నారు. ఇప్పుడు విచారణను వేగవంతం చేసే క్రమంలో ప్రాసిక్యూషన్ అనుమతి కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# సింగపూర్ హోం మంత్రితో ఏపీ మంత్రుల భేటీ..

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక ఆసక్తిని కనపరిచారు. ఏపీలో కూడా ఇటువంటి అధునాతన వ్యవస్థలను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించారు. మరోవైపు, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో మంత్రులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పట్టణాల రూపకల్పన, భూమి వినియోగంలో పారదర్శకత, 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనలో బాధ్యతాయుతంగా ఎలా వ్యవహరించాలనే అంశాలపై నిపుణులు ప్రజెంటేషన్ ఇచ్చారు. నిన్న ప్రారంభమైన మంత్రుల సింగపూర్ పర్యటన... ఏడు రోజుల పాటు కొనసాగనుంది.

# భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు

**మొదటిపేజీ తరువాయి**

వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. గత సంవత్సరం ఇదే రోజున పహల్గామ్‌లో దారుణమైన ఉగ్రదాడి జరిగిందని, అమాయకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు, బంధువులకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలో దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎన్నటికీ సఫలం కావని పేర్కొన్నారు. కాగా, గత సంవత్సరం ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.

# తెరుచుకున్న కేదార్‌నాథ్ తలుపులు..

**మొదటిపేజీ తరువాయి**

మంచు కొండల నడుమ కొలువైన కేదార్‌నాథ్ ఆలయం నేడు ఉదయం 8 గంటలకు వైభవంగా తెరుచుకుంది. వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాల మధ్య సుమారు 51 క్వింటాళ్ల పూలతో అందంగా అలంకరించిన ఈ పుణ్యక్షేత్రం భక్తులకు స్వాగతం పలికింది. స్వామి వారి సందర్శనార్థ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మరోవైపు, రేపు విష్ణుమూర్తి నివాసమైన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక సందేశాన్ని ఇచ్చారు. చార్‌ధామ్ యాత్ర మన దేశ విశ్వాసానికి, ఐక్యతకు మరియు సుసంపన్నమైన సంప్రదాయాలకు దివ్య ఉత్సవం వంటిదని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి యాత్ర సుఖమయంగా సాగాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# ఖాళీ స్థలాలపై పన్ను రాయితీ

**, మొదటిపేజీ తరువాయి**

పట్టణాలు, నగర పంచాయతీల పరిధిలో అనుమతి పొందిన అన్ని నిర్మాణాలకు ఈ తగ్గింపు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ఏటా ప్రజలపై పడే రూ.30 కోట్ల ఆర్థిక భారం తగ్గనుంది. ఇళ్లు లేదా వాణిజ్య భవనాలు నిర్మించడానికి అన్ని రకాల అనుమతులు తీసుకున్నప్పటికీ, నిర్మాణ కాలంలో అధికారులు మళ్లీ ఖాళీ స్థలం పన్ను విధించడం ప్రజలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రజలతో పాటు రియల్ ఎస్టేట్ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఈ పన్నును సగానికి తగ్గించాలని నిర్ణయించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం భవన నిర్మాణానికి అనుమతి పొందిన రోజు నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే వరకు లేదా అనుమతి గడువు ముగిసే వరకు (వీటిలో ఏది ముందైతే అది) ఈ 50 శాతం పన్ను తగ్గింపు వర్తిస్తుంది. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలకు ఈ తగ్గింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ పన్ను తగ్గింపునకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు అధికారిక జీవోను విడుదల చేసింది. వాస్తవానికి వీఎల్‌టీ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు ఏటా సుమారు రూ.60 కోట్ల ఆదాయం సమకూరేది. తాజా తగ్గింపుతో ఈ ఆదాయం రూ.30 కోట్లకు పరిమితం కానుంది. గతంలో 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఈ పన్నును తగ్గించాలని నిర్ణయించి జీవో ఇచ్చినా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని అమలు చేయలేదు. ఇప్పుడు మళ్లీ అదే నిర్ణయాన్ని అమలు చేస్తుండటంతో నిర్మాణ రంగంలో ఉన్న వారికి, సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే వారికి భారీ ప్రయోజనం చేకూరనుంది.

# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

**మొదటిపేజీ తరువాయి**

పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 294 నియోజకవర్గాలకు గానూ రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. అందులో మొదటి దశలో భాగంగా 152 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మిగతా 142 స్థానాలకు ఈనెల 29న పోలింగ్ జరగనున్నది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. మే 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

# ఆరుగురు ఐపీఎస్‌లకు పదోన్నతులు


**తెలంగాణలో ఆరుగురు ఐపీఎస్‌లకు డైరెక్టర్ జనరల్ హోదా**

**పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**డీజీగా పదోన్నతి పొందినవారిలో మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సజ్జనార్**

**లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉన్న మహేశ్ భగవత్**

**హైదరాబాద్ ఏప్రిల్ 22 ఆంధ్ర ప్రగతి**




తెలంగాణలో ఆరుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ (డీజీ)గా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందినవారిలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు, చారుసిన్హా, అనిల్ కుమార్, వీసీ సజ్జనార్ ఉన్నారు.

మహేశ్ భాగవత్ ప్రస్తుతం లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉండగా, స్వాతి లక్రా స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్నారు. వీవీ శ్రీనివాసరావు తెలంగాణ పోలీసు నియామక మండలి చైర్మన్‌గా ఉన్నారు. సీఐడీ, మహిళా భద్రతా విభాగం, ఏసీబీ ఏడీజీగా చారు సిన్హా విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ కుమార్ గ్రేహౌండ్స్ ఏడీజీగా ఉండగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ప్రస్తుతం వీసీ సజ్జనార్ ఉన్నారు.

# మాజీ సీఎం నాదెండ్ల కన్నుమూత..

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల మృతి పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన... 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరారు. 1984లో చికిత్స కోసం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన సమయంలో... కొంత మంది ఎమ్మెల్యేల మద్దతులో నాదెండ్ల సీఎం అయ్యారు. నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల... ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

1989లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించారు.

### టీడీపీకి కర్త, కర్మ, క్రియ

ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో నాదెండ్ల భాస్కర్ రావు గురించి పెద్దచరిత్రే ఉంది. అన్నఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీ పెట్టడానికి కర్త, కర్మ,క్రియగా వ్యవహరించారు. అంతేకాదు తెలుగు దేశం పార్టీ పెట్టినకొత్తలో ఎన్టీఆర్ తర్వాత నెంబర్ టూ స్థానం ఈయనదే. ఇక 1984లో ఎన్టీఆర్ గుండె బైపాస్ సర్జరీ కోసం అమెరికా వెళ్లినపుడుపార్టీని చీల్చి ముఖ్యమంత్రిఅయ్యారు. ముందుగా కాంగ్రెస్ పార్టీఅండగా నిలుస్తుందనే హామీతో సీఎం పీఠం ఎక్కారు. ఆ తర్వాతఎన్టీఆర్ ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.. ఆపై కాంగ్రెస్ పార్టీ



తన మద్దతు ఉపసంహరించుకోవడంతో నాదెండ్ల భాస్కర్ రావుముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఉమ్మడిరాష్ట్రంలో అతి తక్కువ కాలం ముఖ్యమంత్రిగా 1984 ఆగష్టు 16నుంచి సెప్టెంబర్ 16 వరకు ఈ పదవిలో కొనసాగారు.

### తిరిగి కాంగ్రెస్ గూటికి..

ఇక కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన ఈయన ఆతర్వాత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టీలో కీలకంగా వ్యవహరించారు. అన్న ఎన్టీఆర్ కి వెన్నుపోటు ఎపిసోడ్ తర్వాత తిరిగికాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. చివర్లో మాత్రం భారతీయ జనతా పార్టీలో చేరినా.. పెద్దగా యాక్టివ్ గా లేరు. ఈయన కుమారుడునాదెండ్ల మనోహర్ ఏపీ మంత్రిగా ఉన్నారు. అంతేకాదు ఉమ్మడిఆంధ్ర ప్రదేశ్ లో డిప్యూటీ స్పీకర్ గా.. స్పీకర్ గా పనిచేశారు..

### స్వస్థలం గుంటూరు

నాదెండ్ల భాస్కర్ రావు అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉన్నఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరులో 23 జూన్ 1935లో జన్మించారు. ఆంధ్ర ప్రదేశ్ 11వ ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేశారు. అంతేకాదు ఈయన తెనాలి నుంచి శాసనసభ్యుడిగా పలుమార్లుఎన్నికయ్యారు. అంతేకాదు 1978లో చెన్నారెడ్డి ప్రభుత్వంలోమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకా..ఆయన క్యాబినేట్ లో ఫైనాన్స్ మినిస్టర్ గా పనిచేశారు. ఈయనఉస్మానియా యూనివర్సిటీ నుంచి 'లా' పూర్తి చేశారు. 1998లో 12వ లోక్ సభకు ఖమ్మం నుంచి ఎన్నికయ్యారు. ఆ తర్వాత రాజకీయంగా అంతగా యాక్టివ్ గా లేకపోయినా.. ఆ మధ్య విడుదైలనఎన్టీఆర్ బయోపిక్ లో తన పాత్రను తప్పుగా చూపించారని కోర్టులోకేసు ఫైల్ చేసి మరోసారి వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

### మనోహర్‌కు ఫోనులో బాబు పరామర్శ

మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. భాస్కరరావు తనయుడు, మంత్రి నాదెండ్ల మనోహ ర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబ సభ్య లకు తన సానుభూతి తెలిపిన చంద్రబాబు, భాస్క రరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంత్రి లోకేశ్ కూడా నాదెండ్ల భాస్కరరావు మృతికి సంతాపం తెలియజేశారు.

### డిప్యూటీ సీఎం పవన్ సంతాపం

నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కుమారుడు, సహచర మంత్రి మనోహర్ పితృ వియోగం బాధ నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పీపీపీ మెడికల్ కాలేజీలు..నెలలో పట్టాలెక్కాలి..

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పీపీపీ విధానంలో ఫేజ్-1లోని మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని మెడికల్ కాలేజీల పనులు ప్రారంభించాలని చెప్పారు. ఫేజ్-2లో అమలాపురం, బాపట్ల, పెనుకొండ, నర్సీపట్నం, పాలకొల్లు, పార్వతీపురం మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఏడు పిల్లర్లతో ఏపీ స్టేట్ హెల్త్ ఇన్‌ఫ్వెస్ట్‌మెంట్ పాలసీ 2026-31ని త్వరలోనే తీసుకురావాలని నిర్దేశించారు. అమరావతి-వీఈఆర్‌లో మెడిసిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అమరావతిలో నేచురోపతి కేంద్రం నెలకొల్పేలా ఆయుష్ శాఖకు లేఖ రాయాలని సూచించారు. ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేలా ప్రివెంటివ్ హెల్త్ విధానం, సిటిజెన్ హెల్త్ స్క్రీనింగ్‌పై దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఇందుకోసం పబ్లిక్ హెల్త్ డేటాను వినియోగించుకోవాలన్నారు. సంజీవని ప్రాజెక్టును వేగంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఎనీమియా, డయాబెటిస్ వంటి వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. జనాభా నియంత్రణ నుంచి జనాభా సంరక్షణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 2.1 నుంచి 1.5కి తగ్గిందని, అత్యధికంగా కడప జిల్లాలో 1.99 ఫెర్టిలిటీ రేట్ ఉంటే, అత్యల్పంగా 1.32 విశాఖలో నమోదైందని అధికారులు తెలిపారు. ఫెర్టిలిటీ రేటు 2.1 లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సీఎం చెప్పారు. మన దేశ కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉందని, దీనిని కాపాడేకునేందుకు మైక్రో ఫ్యామిలీ సంస్కృతి విస్తరించకుండా చూడాలన్నారు. ఉమ్మడి పెద్ద కుటుంబాలకు అధిక ప్రోత్సాహకాలపై ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జనాభా నిర్వహణ అంశాన్ని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. సమతుల ఆహారం తీసుకోకపోవడం వల్ల ఎక్కువ మంది అనారోగ్యం పాలవుతున్నారని.. పోషకాహారం, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. ఆయుర్వేద, నేచురోపతి చికిత్సా విధానాలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా, ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వారి రికార్డుల ఆధారంగా డైట్, పోషకాహారం అందించాలని చెప్పారు.

# ఎలాంటి చర్యలొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఈ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్, హరీశ్ రావు సహా అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నలుగురు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# కాల్పుల విరమణ పొడిగింపు!

**మొదటిపేజీ తరువాయి**

ఇక మరోవైపు, ఒప్పందం కుదరకపోతే మళ్ళీ పోరు తప్పదని ఉభయ పక్షాలు హెచ్చరించాయి. గడువులోగా ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై బాంబుల మోత తప్పదని ట్రంప్ పేర్కొనగా, అమెరికా గనుక మళ్ళీ యుద్ధం మొదలెడితే పశ్చిమాసియా చమురు పరిశ్రమను నాశనం చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) సీనియర్ కమాండర్ ఒకరు హెచ్చరించారు. ఇరాన్‌పై దాడికోసం తమ భూభాగాలను అమెరికా ఉపయోగించుకునేందుకు దక్షిణాది పొరుగుదేశాలు శత్రువును అనుమతిస్తే ఇక వారు చమురు ఉత్పత్తికి బై బై చెప్పుకోవాల్సిందేనని ఆ కమాండర్ హెచ్చరించారు.

ఇదిలా వుండగా, రెండో దఫా చర్చల కోసం అమెరికా, ఇరాన్‌లను ఒక చోటకు చేర్చేందుకు పాకిస్తాన్ తిప్పలు పడుతోంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సహా నేతలందరూ ముమ్మరంగా కృషి చేస్తున్నారు. ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించగానే పాక్ అభ్యర్ధనను మన్నించినందుకు షరీఫ్ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ ప్రకటనతో దౌత్య ప్రయత్నాలు కొనసాగుతాయని వ్యాఖ్యానించారు. ఇలా చర్చల కోసం పాక్ అంతా సన్నద్ధం చేసుకుంటుండగా, చర్చల్లో పాల్గొనాలా వద్దా అనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ పేర్కొంది. అమెరికా అనామోదయోగ్యమైన చర్యల కారణంగా చర్చలపై తాము తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై ప్రభుత్వ టివితో చెప్పారు. దీంతో అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నేతృత్వంలో ప్రతినిధి బృందం జరపాల్సిన ఇస్లామాబాద్ పర్యటనను వైట్‌హౌస్ నిలువరించింది.

### హోర్ముజ్‌ను దాటేందుకు యత్నం ఇరాన్ అధీనంలోకి రెండు నౌకలు మూడో దానిపై కాల్పులు

ఆంక్షలు కొనసాగుతున్నా హోర్ముజ్‌ను దాటేందుకు ప్రయత్నించిన మూడు కంటెయినర్ నౌకలను ఇరాన్ బలగాలు లక్ష్యంగా చేసుకున్నాయి. వాటిల్లో రెండు నౌకలను తమ అధీనంలోకి తెచ్చుకున్నామని, మూడో దానిపై కాల్పులు జరిపామని ఇరాన్ గార్డులు ప్రకటించారు. ఒమన్ తీర ప్రాంతంలోని కంటెయినర్‌పై ఇరాన్ గన్‌బోట్లు బుధవారం కాల్పులు జరిపిన విషయాన్ని బ్రిటీష్ మారిటైమ్ సెక్యూరిటీ సంస్థ కూడా పేర్కొంది. ఇరాన్ తీరానికి సమీపంలో వున్న నౌకపై కూడా కాల్పులు జరిగాయని తెలిపింది.

విడిగా జరిగిన మరో సంఘటనలో హోర్ముజ్‌ను దాటేందుకు ప్రయత్నించిన రెండు నౌకలను ఇరాన్ తీర ప్రాంత జలాల్లోకి మళ్ళాల్సిందిగా ఆదేశించినట్లు ఐఆర్‌జిసి తెలిపింది. వాటిల్లో ఒకటి లైబీరియా పతాకంతో వున్న నౌక గుజరాత్‌లోని ముండా పోర్ట్‌కు వెళ్ళాల్సి వుందని పేర్కొంది.

### ఆహార సరఫరాపై ఎలాంటి ప్రభావం లేదు

తమ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధనాన్ని అమలు చేస్తున్నా దాని ప్రభావం ఆహార సరఫరాపై లేదని ఇరాన్ వ్యవసాయ మంత్రి ఘోలామ్రెజా నూరి చెప్పారు. తమ ప్రజలకు మౌలిక సరుకులు అన్నీ అందుబాటులో వున్నాయని, ఇందుకు పటిష్టంగా వున్న దేశీయ ఉత్పత్తి, ప్రత్యామ్నాయ దిగుమతి మార్గాలు కారణమని పేర్కొన్నారు. 85శాతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ దేశీయంగానే తయారవుతాయని అందువల్లే దేశ ఆహార భద్రత భద్రంగా వుందని అన్నారు.

### ఇజ్రాయిల్-లెబనాన్ చర్చలు


ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య చర్చలు పునరుద్ధరించబడాల్సి వుందని హిజ్బుల్లా పేర్కొంది. గత శుక్రవారం పదిరోజుల కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుండి ఇజ్రాయిల్ తరచుగా దారుణమైన ఉల్లంఘనలకు పాల్పడుతోందని హిజ్బుల్లా విమర్శించింది. ఈ ఉల్లంఘనల్లో పౌరులపై కూడా దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. గ్రామాలకు గ్రామాలు నేలమట్టమవుతున్నాయని విమర్శించింది. తాము కూడా మొదటిసారిగా ఇజ్రాయిల్ బలగాలపై రాకెట్లు, డ్రోన్లు ప్రయోగించామని తెలిపింది.

# మోదీ పాలనలో పల్లెలకు 'డిజిటల్' కళ.!

**-నంద్యాల జిల్లాలో 363 సి.ఎస్.సి కేంద్రాల ఏర్పాటు అభినందనీయం.**

**.. ప్రధాని మోడీ వల్ల దేశ స్థాయి నుంచి గ్రామస్థాయికి చేరుకున్న డిజిటల్ కళ.**

**- నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:** భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే నంద్యాల జిల్లాలోని పల్లెలు నేడు డిజిటల్ శక్తితో వెలుగుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు.

**సేవలు ప్రజల ముంగిటకే..**

కేంద్ర ప్రభుత్వ 'డిజిటల్ ఇండియా' సంకల్పం నేడు నంద్యాల జిల్లాలో సాకారమవుతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 363 కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా 800కు పైగా సేవలను నేరుగా గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. గతంలో ఆధార్ మార్పుల కోసం, బ్యాంకింగ్ సేవల కోసం పల్లె ప్రజలు పనులు మానుకుని పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు గ్రామాల్లోనే ఆధార్, బ్యాంకింగ్, ఆరోగ్య, విద్యా సేవలు అందుతున్నాయి" అని మధు వివరించారు.

**యువతకు ఉపాధి కల్పన..**

కేంద్ర ప్రభుత్వం కేవలం సేవలను అందించడమే కాకుండా, గ్రామాల్లోనే యువతకు స్వయం ఉపాధిని కల్పిస్తోందని ఆయన అన్నారు.

**VLE ల ద్వారా ఉపాధి:** గ్రామ స్థాయి వ్యవస్థాపకుల ద్వారా వేలాది మందికి స్వయం ఉపాధి లభిస్తోంది.

భవిష్యత్ నైపుణ్యాలు: గ్రామీణ యువతకు ఏఐ స్కిల్స్, ఈ-కామర్స్ మరియు డిజిటల్ ట్రైనింగ్ ఇస్తూ వారిని రేపటి తరం పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఘనత మోదీ ప్రభుత్వానిదేనని కొనియాడారు.

**గ్రామీణ ఆర్థిక విప్లవం..**

ఈ సి.ఎస్.సి కేంద్రాలు కేవలం సేవా కేంద్రాలు మాత్రమే కావని, ఇవి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే 'ఆర్థిక విప్లవ కేంద్రాలు' అని అభిరుచి మధు అభివర్ణించారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## జిల్లా లో పరిశ్రమల స్థాపనను వేగవంతం చేయాలి.

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 22:** జిల్లా లో పరిశ్రమల స్థాపనను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఎంఓయూలు అయిన మరియు అనుమతి పొందిన ప్రాజెక్టులపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలులో ఉన్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ప్రాజెక్టుల వేగవంతమైన అమలు, భూసేకరణ, అవసరమైన అనుమతులు, అలాగే ఇతర సమస్యలపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో 38 పరిశ్రమల ఏర్పాటుకు ఎంవోయూ లు అయ్యాయని, వీటిలో ఇంకా మొదలు పెట్టని పరిశ్రమలను త్వరితగతిన మొదలు పెట్టాలని,అలాగే మొదలు పెట్టిన పరిశ్రమలను వేగంగా పూర్తి చేయాలని, పూర్తి అయిన పరిశ్రమలను త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని పరిశ్రమలను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధు సూదన్ రెడ్డి, ఎన్ఆర్ఈడి సిఏ డెవలప్మెంట్ ఆఫీసర్ వీరేంద్ర పాల్గొ న్నారు.

## మహానంది క్షేత్రంలో నేడు గంగా పుష్కరోత్సవం.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 22:** మహానంది క్షేత్రంలోని నందితీర్థంలో వైశాఖ శుద్ధ సప్తమి నాడు జరిగే అద్భుతం అమోఘమైనది. ఆరోజున గంగాదేవి స్వయంగా ఇక్కడి తీర్థానికి చేరుకుని సంకల్ప స్నాన మాచరించి శుద్ధిని పొందుతుందని స్వయంగా పురాణేతిహాసాలు చెబుతున్నాయి. అంతటి మహిమాన్వితమైన నందితీర్థమనే రుద్రగుండంలో స్నానం చేసే భక్తులకు కలిగే ప్రయోజనాలు అనంతం.

దేవతలు, మహర్షులు,మానవులు గంగలో స్నానం చేసి సమస్త పాపములను పోగొట్టుకుంటూ ఉంటారు. అలా అందరి పాపాలను తీసుకునే గంగాదేవి నేనందరికి మోక్షాన్నికలిగిస్తున్నాను.అలా అందరూ నాలో విడిచిన పాపలను నేను పోగొట్టుకోవాలంటే ఏం చేయాలని పూర్వం స్వయంగా ప్రమేశ్వరుణ్ణి కోరగా. అందులకు పరమేశ్వరుడు భూమండలంలో నా శిష్యుడైన నందీశ్వరుడు జన్మించిన మహానంది అనే పుణ్యస్థలమున్నదనీ, అక్కడి నందితీర్థంలో సంవత్సరమునకు ఒకమారు స్నానం చేయమని అనగా గంగావతరణం జరిగిన (వైశాఖ శుద్ధ సప్తమి రోజున) తద్వారా నీకు స్వచ్ఛత చేకూరుతుందని నీవు స్వీకరించిన అందరి దోషములను పోగొట్టుకుని స్వచ్ఛముగా అవుతావని ఆనతిచ్చినారు.

దీనితో సంవత్సరం పొడుగునా ప్రజలు గంగానదిలో స్నానం చేసి విడిచిపెట్టిన పాపాలన్నింటిని నీవు ఇక్కడ విసర్జించి పునీతురాలవుతావని పరమేశ్వరుడు పలికారు. కావున గంగాదేవి స్వయంగా మహానంది క్షేత్రానికి వచ్చి స్నానమాచరిస్తే ఉంది.12సంవత్సరాలకు ఒకమారు వచ్చే గంగా నది పుష్కరాల స్నానమును గంగ జన్మించిన స్థలంలో చేస్తే ఎంతటి పుణ్యఫలమో ఈ మహానంది తీర్థంలో వైశాఖ శుద్ధ సప్తమి రోజున చేసే స్నానం అంటి పుణ్యప్రదమైనది.బ్రహ్మహత్యాది మహా దోషములను పోగొడుతుంది.ఈ రోజున స్నానం చేయడంతో పాటు పుష్కరాల్లో ఆచరించి జపం, దానం, సంకల్పస్నానముల వలన సంపూర్ణ పుష్కర ఫలమును పొందవచ్చును.మన ప్రాంతంలో మనకు కలిగిన ఇంతటి మహద్భాగ్యాన్ని అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తరించగలరు.మహానంది క్షేత్రంలోకి గంగా దేవి స్నానం గురించి శివ మహాపురాణం లో చెప్పిన విశేషం

## పోషణ పక్షోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి.

**..పిల్లల భవిష్యత్తుకు ఉమ్మడి కుటుంబాలే బలమైన పునాది.**

**..మొదటి 1000 రోజులు అత్యంత కీలకం - తల్లిదండ్రులకు అవగాహన అవసరం.**

**..ఫోన్లు, టీవీల అతివాడకం పిల్లల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం.**

**..కథల ద్వారా పిల్లల్లో నైతిక విలువల పెంపకం అవసరం...జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 22:**పోషణ పక్షోత్సవాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజల్లో ఆరోగ్యం మరియు పోషకాహారంపై విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుకనున్న నివర్తి భవన్‌లో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, సమాజంలో మారుతున్న కుటుంబ వ్యవస్థ, పిల్లల పెంపక విధానాలు మరియు ఆధునిక జీవనశైలితో ఏర్పడుతున్న సమస్యలపై పోషణ పక్షోత్సవాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఉమ్మడి కుటుంబాలు ప్రస్తుతం తగ్గిపోవడం, వాటి స్థానంలో చిన్న కుటుంబాలు (న్యూక్లియర్ ఫ్యామిలీస్) పెరగడం వల్ల పిల్లల సంరక్షణలో లోటుపాట్లు ఏర్పడుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడం వల్ల పిల్లలను డే కేర్ కేంద్రాలు లేదా ఇతరుల వద్ద ఉంచాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధిలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమని స్పష్టం చేస్తూ, గర్భధారణ దశ నుంచి పుట్టిన తరువాత రెండున్నర సంవత్సరాల వరకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దశలో తల్లి పాలివ్వడం, ప్రేమతో పెంచడం, పాటలు పాడడం వంటి చర్యలు పిల్లల మానసిక మరియు నరాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని వివరించారు. అదేవిధంగా, చిన్నపిల్లలకు ఫోన్లు, టీవీలు అధికంగా ఇవ్వడం వల్ల కంటి సమస్యలు, మాట్లాడే లోపాలు, సామాజిక దూరం, హైపర్ యాక్టివిటీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని హెచ్చరించారు. పిల్లలతో ప్రత్యక్షంగా గడపడం, వారితో సంభాషించడం అత్యంత అవసరమని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలలో మంచి విలువలు పెంపొందించేందుకు కథల ద్వారా బోధన ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, "సింద్రెల్లా" కథను ఉదాహరణగా వివరించారు. ఈ కథ ద్వారా దయ, సహనం, మంచితనం వంటి గుణాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లల పెంపకంలో తాతయ్యలు, అమ్మమ్మల పాత్ర అత్యంత ముఖ్యమని గుర్తుచేస్తూ, కుటుంబ సభ్యులందరూ కలిసి పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అలాగే, తల్లిదండ్రులు సరైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దేందుకు కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# అనుమతులు పొందిన జలధార - జలహారతి పనులు వెంటనే ప్రారంభించాలి.

**..మిగిలిన పనులకు తక్షణ అనుమతులు పొందాలి. -..అరికెర రెసిడెన్షియల్ స్కూల్ సంఘటన పై కలెక్టర్ సీరియస్.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 22:** జలధార జలహారతి కార్యక్రమం కింద అనుమతులు పొందిన అన్ని పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.

బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, ఏపీఓలతో ప్రత్యక్షంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., జలధార జలహారతి కార్యక్రమం పరిధిలో ఇప్పటికే అనుమతులు పొందిన పనులు అయిన కొత్త ఫారం పాండ్లు, ఫీడర్ ఛానెల్ డి-సిల్టింగ్, చెరువుల పూడిక తీత, పెర్కోలేషన్ ట్యాంకుల పూడిక తీత వంటి పనులను తక్షణమే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇంకా అనుమతులు పొందని పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఏపీడబ్ల్యూఆర్ఐఎంఎస్ పోర్టల్లో పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించి, పని పేరు, లొకేషన్, పనుల స్థానం, అంచనా వ్యయం, ఎన్ఆర్జీఎస్ కింద ఖర్చు, జలధార కింద ఖర్చు వంటి అన్ని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, ఈరోజే రాత్రి లోపు జిల్లా కలెక్టర్ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఏపీఓలు, ఏఈలు మండల స్థాయి ప్రజాప్రతినిధుల తీర్మానాలతో పాటు సరైన అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని స్పష్టం చేశారు. పనుల ప్రణాళికలో పారదర్శకతతో పాటు సమయపాలన పాటించాలన్నారు. అలాగే జిల్లా డి.డబ్ల్యూ.ఎం.ఏ వద్ద అందుబాటులో ఉన్న సుమారు 10 లక్షల మొక్కలను విస్తృతంగా నాటాలని, జలధార పనులను పచ్చదనం పెంపుతో అనుసంధానం చేసి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కలెక్టర్ సూచించారు. ఈ చర్యల ద్వారా భూగర్భ జలాల నిల్వలు పెరగడంతో పాటు, వాతావరణ సమతుల్యతకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.





ఎన్ఆర్జీఎస్ పనులకు హాజరయ్యే కార్మికులతో జనాభా లెక్కల సేకరణలో భాగంగా సెల్ఫ్ ఎనుమరేషన్ (స్వీయ గణన ) నిర్వహించాలని ఆదేశించారు. దీనివల్ల ఖచ్చితమైన జనాభా డేటా అందుబాటులోకి వస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు.

ఆలూరు మండలం అరికెర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ లో జరిగిన సంఘటన పై కలెక్టర్ సీరియస్ అయ్యారు. విద్యార్థులు క్రమశిక్షణ తో ఉండాలని కలెక్టర్ రెసిడెన్షియల్ స్కూల్ అధికారులను ఆదేశించారు..సిబ్బంది నిర్లక్ష్యం, అనుచిత ప్రవర్తన పై చర్యలు తీసుకున్నామని, హాస్టళ్లలో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ళలో ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, తహసీల్దారులు, ఎంపీడీవోలు మండలాల్లో ఉన్న వసతి గృహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి విద్యార్థులతో ఏకాంతంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎస్ఈ ఇరిగేషన్ బాలచంద్ర రెడ్డి, జెడ్పీ సీఈఓ రమణా రెడ్డి, డి.డబ్ల్యూ.ఎం.ఏ పీడీ నరసింహ రెడ్డి, జిల్లా ఎంపిడీఓలు, ఏఈలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి అభినందన సభ

**..ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఎన్ఎండి ఫరూక్.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:** నంద్యాల స్థానిక గాంధీ చౌక్ దగ్గరలో ఉన్న శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి సభ్యుల అభినందన సభ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ బింగుమల్ల సుబ్బలక్ష్మయ్య గారిని మరియు పాలక మండలి సభ్యులైన వసుంధర దేవి, లక్ష్మణ్ సింగ్, వరలక్ష్మి శారదాబాయి, భారతి విజయభాస్కర్, సుబ్రహ్మణ్యం,రాజ్ పురోహిత్ బాబు సింగ్, సుబ్రహ్మణ్య శాస్త్రి (ఎక్స్ అఫీషియో సభ్యులు) లను మంత్రి ఫరూక్ ఘనంగా సన్మానించారు.

చైర్మన్ సుబ్బలక్ష్మయ్య మాట్లాడుతూ భక్తులందరికీ స్వామివారి దర్శనం సులభతరం చేసేలా, ఆలయ ప్రతిష్టను మరింత పెంచేలా, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తమ పాలక మండలి కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు నిలయాలని, భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నూతన పాలక మండలి పనిచేయాలని సూచించారు. ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బింగుమల్ల సుబ్బలక్ష్మయ్య గారికి మరియు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. చారిత్రక నేపథ్యం ఉన్న శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. పాలక మండలి సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి ఆలయ ప్రతిష్టను మరింత పెంచాలని పిలుపునిచ్చారు.



ఈ అభినందన సభలో గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య , కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, జిల్లెల్ల శ్రీరాములు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మురళీధర్, మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్, ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు బింగ్ మల్లె శ్యామ్ సుందర్ గుప్తా, ప్రథమనంది దేవస్థానం చైర్మన్ చలం బాబు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బోయ రామకృష్ణ తదితర నాయకులు, ఆలయ అర్చకులు మరియు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రైతు కుటుంబంలో జన్మించి...

# తెలంగాణా డి. ఐ.జి.గా ఎదిగిన వెంకట రమణా రెడ్డి.!

....రాయలసీమలోని కొత్తపల్లె గ్రామానికి గర్వకారణం. - స్వతంత్రం వచ్చిన తర్వాత రాయలసీమలో మొదటి డి. ఐ.జి .గా వెంకట రమణా రెడ్డి.











**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ ఏప్రిల్ 22:**
రైతు కుటుంబంలో జన్మించి నంద్యాల మండలం కొత్త పల్లె టూ తెలంగాణా బెటాలియన్ డి. ఐ.జి.గా వెంకటరమణా రెడ్డి ఎదిగారు. కొత్తపల్లె ముద్దుబిడ్డకు ఉన్నత పదవి లభించడంతో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి,గ్రామస్తులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.గ్రామస్థాయి నుంచి డి. ఐ. జి వరకు ఆయన ప్రస్థానం అద్భుతం అని గ్రామస్తులు కొనియాడారు.తమ గ్రామానికి చెందిన జంగం వెంకటరమణా రెడ్డి డి. ఐ.జి గా ఎన్నిక కావడంతో కొత్తపల్లె గ్రామం పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది,మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ మా ఊరి బిడ్డ అత్యుత పదవిలో ఉండడం గ్రామానికి గర్వకారణం అన్నారు.కష్టపడే తత్వమే ఆయనను ఈ స్థాయికి చేరిందన్నారు.కష్టపడితే ఏది లేదని నిరూపించారన్నారు.సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి తెలంగాణా రాష్ట్రంలో డి. ఐ. జి స్థాయి అత్యున్నత పదవి చేపట్టి గ్రామానికి,రాయలసీమ కు గౌరవాన్ని తీసుకొచ్చారన్నారు. కొత్తపల్లె గ్రామంలో జంగం వెంకటరెడ్డి అంటే తెలియని వారు ఎవరు లేరన్నారు.ఆయన తండ్రిగారి పేరుమీద జంగం వెంకటరెడ్డి గా పిలవబడే ఆయన చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి చదువుకున్నారన్నారు.ఆయన ఇంటి పక్కనే పెరిగిన నేను ఆయన ఉన్నత స్థానం చేరుకోవడం గర్వకారణం అన్నారు.మా గ్రామంలో ఎంతో మంది లాయర్లు,ఇంజనీర్లు,రాజకీయ పదవులు పొందుతున్నారన్నారు.నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని తమకు నచ్చిన రంగాల్లో విజయం సాధించాలన్నారు.తెలంగాణా బెటాలియన్ డి. ఐ.జి.జంగం వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లె గ్రామంలో రైతు కుటుంబంలో 1965 లో జన్మించానని అన్నారు.గ్రామంలో అయిదవ తరగతి వరకు చదివి నంద్యాలలో ఫాతిమా హైస్కూల్ లో ఆరు నుంచి పదవతరగతి వరకు చదువుకున్నానని అన్నారు.పై చదువులు కడపలో చదువుతూ పోలీస్ సెలెక్షన్ లో అత్యుత్తమ మార్కులతో ఎంపిక అయ్యానన్నారు.1991 లో ఇన్స్పెక్టర్ స్థాయి నుంచి ప్రారంభం అయ్యి డీఎస్పీ,ఎస్పీ పనిచేసాను అన్నారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి భద్రతా విభాగంలో సుమారు మూడు సంవత్సరాలు పనిచేశానని అన్నారు.అంచలంచెలుగా ఎదుగుతూ తెలంగాణ బెటాలియన్ డి. ఐ.జి.స్థాయికి చేరుకున్నారని అన్నారు.పదవులు ఎంత పై స్థాయికి వచ్చిన పుట్టిన గ్రామాన్ని,మరచిపోనని అన్నారు.తెలంగాణా కు వచ్చే ప్రతి ఒక్క సీమా బిడ్డకు చట్టబద్ధంగా అవసరమైన సహాయం చేయడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటానని బరోసా ఇచ్చారు.యువత లక్షణాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చన్నారు.న్యాయవాది తులసిరెడ్డి పేద ప్రజలకు ఆయన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న విషయం అందరికీ తెలుసన్నారు.రాజకీయాల్లో ఎమ్మెల్యే స్థాయి వారు ఏదో ఒకటి ఆశించి పనిచేస్తున్న సమాజంలో ప్రతిఫలం ఆశించకుండా తులసి రెడ్డి పేదలకు సహాయం చేస్తున్నారని అన్నారు.యువత చిన్నప్పుడే తమ లక్ష్యానికి పునాది వేసుకుంటే లక్షం సాధించవచ్చు అన్నారు.నా చిన్న తనంలో మా నాన్న స్నేహితులు మీ అబ్బాయి తప్పని సరిగా పోలీస్ శాఖలో ఉన్నత స్థాయికి ఎదుగుతాడని చెప్పేవారని గుర్తుచేశారు.ఇష్టపడి చిన్న తనం నుంచే చదువుపై మక్కువతో విజయాలు సాధించి ఈ స్థాయికి ఎదిగానన్నారు.మా ఊరి గ్రామస్తులు



అందరూ నాకు సన్మానంచేసిన అందరికీ పేరు,పేరు న కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఉంటే నిజ జీవితంలో ఏదైనా సాధించవచ్చని యువతకు దిశా నిర్దేశం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో బంగారు వ్యాపారి గౌరీనాథ్,గ్రామస్తులు ఆయనకు శాలువాలు,పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

# నంద్యాలలో జన ఔషధీ మెడికల్ స్టోర్ ప్రారంభం.

**..పేదలకు తక్కువ ధరల్లో నాణ్యమైన మందుల అందుబాటు.**

**..రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సేవల విస్తరణకు నూతన అడుగు.**

**..మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్, ఎంపీ బైరెడ్డి శబరి చేతుల మీదుగా ప్రారంభం.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి కీలక పాత్ర.**

**..కార్పొరేట్ సంస్థల సహకారంతో ఏర్పాటైన మెడికల్ స్టోర్.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 22:**
స్వచ్ఛమైన, నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందించడమే జన ఔషధీ లక్ష్యమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జేఎస్డబ్ల్యూ, రాంకో, రేన్ సిమెంట్ కంపెనీల సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ మెడికల్ స్టోర్‌ను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ మరియు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు అత్యంత తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో ఈ జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ఈ మెడికల్ షాప్‌ను రెడ్ క్రాస్ సంస్థకు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి, సేవలను విస్తృతం చేయాలని రెడ్ క్రాస్ ప్రతినిధులను సూచించారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో తక్కువ వ్యవధిలోనే బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు, "మీ ఇంటికి మీ డాక్టర్" వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఇప్పుడు పేద ప్రజలకు నాణ్యమైన మందులు తక్కువ ధరల్లో అందించేందుకు జన ఔషధీ మెడికల్ స్టోర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని ఆమె కోరారు.పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన జన ఔషధీ పథకం ద్వారా నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. నంద్యాలలో ఈ కేంద్రం ఏర్పాటు కావడానికి మంత్రి, జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ ప్రతినిధుల సమిష్టి కృషి కారణమని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ సుదర్శనం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1 లక్ష విరాళం అందజేశారు. జేఎస్డబ్ల్యూ సిమెంట్ కంపెనీ రూ.3,21,779 (మందులు మరియు పరికరాల కోసం), రాంకో సిమెంట్ రూ.3 లక్షలు (భవనం మరమ్మతులు, మౌలిక సదుపాయాల కోసం), రేన్ సిమెంట్ రూ.1 లక్ష, జిల్లా కలెక్టర్ కార్యాలయం రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా సహకరించిన సంస్థలు, ప్రతినిధులను ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకరించిన జేఎస్డబ్ల్యూ సిమెంట్ కంపెనీ ప్రతినిధి గంగాధర్ కురుప్, రాంకో సిమెంట్ కంపెనీ ప్రతినిధి శోభన్ బాబు, రేన్ సిమెంట్ ప్రతినిధి ఆనంద్ భాస్కర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ వజ్రాల శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ మమతా రెడ్డి, ట్రెజరర్ నాగేశ్వరరావు, ఉస్మాన్ భాష ,కార్యవర్గ సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళల భద్రత పై శాంతిరామ్ ఫార్మా కళాశాలలో అవగాహన కార్యక్రమం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ మరియు సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నేడు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం జావళి ఆధ్వర్యంలో శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి జావలి ఐపీఎస్ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న నేరాలను అరికట్టడానికి మరియు ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళా భద్రత, డ్రగ్స్ మరియు సైబర్ నేరాలు మొదలగు వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు సదరు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ నేపథ్యంలో ప్రజలు కింది అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాము.

**1. మహిళా భద్రత . ఈవ్ టీజింగ్:**
మహిళల మరియు విద్యార్థినుల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత. బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మహిళా పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో శక్తి టీం బృందాలను ఏర్పాటు చేసి వేధింపులకు గురైనప్పుడు లేదా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 112 నంబర్ ద్వారా పోలీసు వారి సహాయం పొందవచ్చు.

మీ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో భయం లేకుండా ఫిర్యాదు చేయవచ్చు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

**2. మాదకద్రవ్యాల నియంత్రణ:**
యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో ప్రజల సహకారం అవసరం. మీ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా లేదా వినియోగిస్తున్నా వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వండి.
తల్లిదండ్రులు మీ పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను గమనించండి. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే వారి స్నేహితులతో సమాచారం తీసుకుని సత్ప్రవర్తన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**3 . సైబర్ క్రైమ్:**
సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. అపరిచితులకు మీ వ్యక్తిగత వివరాలు షేర్ చేయరాదు. మరియు బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్ చేసి మీ ఓటిపి, పిన్ లేదా వ్యక్తిగత వివరాలు అడగరని గుర్తించండి.

**తెలియని నంబర్ల నుండి వచ్చే సందేహాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దు.**

ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. లేదా మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్లో గాని జిల్లా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ గారిని కానీ సంప్రదించి సహాయం పొందవచ్చు.
నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అనుమానిత వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని కోరుతున్నాము.
ఈ కార్యక్రమంలో ఏఎస్పి జావలి తో పాటు పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాం, పాణ్యం సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి మరియు మహిళ వెల్ఫేర్ బృందాలు పాల్గొన్నారు.

# నంద్యాల లో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తాం.

## స్విమ్మింగ్ విజేతల అభినందన సభలో ఎంపీ బైరెడ్డి శబరి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:**
నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఒక అత్యాధునిక స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయిస్తామని తద్వారా జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్విమ్మర్లను తయారు చేస్తామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. జగ్గయ్యపేటలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ లో విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కాశీపురం ప్రభాకర్ రెడ్డి, వి మధుసూదన్ రెడ్డిల అభినందన సభకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నంద్యాల శ్రీ రామకృష్ణా పి జి కళాశాలలో డా. జి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ఎంపీ శబరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్బంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నేను



చిన్నప్పటి నుంచి స్విమ్మర్ నే.
జాతీయ స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ప్రాతినిధ్యం వహించాను, స్విమ్మింగ్ చేయడం వల్లనే నేను ఆరోగ్యంగా ఉన్నాను. మీ పిల్లలకు ఈత నేర్పించడం మీరిచ్చే గొప్ప బహుమతి.స్విమ్మింగ్ లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు సాధించ వచ్చు.
ఆరు పదుల వయసులో ప్రభాకర్ రెడ్డి ఇంత ప్రతిభ చూపడం అద్భుతం..స్విమ్మింగ్ విజేతలను సన్మానించడం నాకు దక్కిన గౌరవం అన్నారు.నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఒక ప్రొఫెషనల్ స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయిస్తాం.నంద్యాల నుంచి స్విమ్మింగ్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేద్దాం. మా నాయకుడు చంద్రబాబు నాయుడు క్రీడలకు అపారమైన ప్రోత్సాహం ఇస్తున్నారు. శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ స్విమ్మింగ్ మీద మక్కువతో తన ఇంట్లోనే ఒక స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామన్నారు. రోజూ స్విమ్మింగ్ చేస్తే మీ ఆరోగ్యం మీ గుప్పిట్లో ఉన్నట్లే అన్నారు. కాశీపురం ప్రభాకర్ రెడ్డి ఒక ప్రతిభా వంతమైన రచయిత గా తెలుసు అనీ, అయితే ఈత లో ఇంత గొప్ప ప్రవీణుడని తెలియదన్నారు.ఈ కార్యక్రమంలో మారంరెడ్డి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ నరహరి విశ్వనాథ రెడ్డి, డా రాకేష్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 23 ఏప్రిల్ 2026

## వెటరన్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా.!

### -నంద్యాల యం.పి బైరెడ్డి శబరి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 22:** నంద్యాల జిల్లా వెటరన్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తానని నంద్యాల యం.పి, టి.డి.పి జాతీయ ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి సీనియర్ జర్నలిస్టులకు హామి ఇచ్చారు. బుధవారం నంద్యాల యం.పి కార్యాలయంలో నంద్యాల జిల్లా జర్నలిస్టు అసోసియేషన్అఫ్ ఆంధ్రప్రదేష్ (జాఫ్) అధ్యక్షులు బి.డి. విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెటరన్ జర్నలిస్టులు తమ సమస్యలపై వినితి పత్రంసమర్పించడం జరిగింది.వెటరన్ జర్నలిస్టులకు అక్రిడియేషన్ కార్డులు ఇచ్చారు అయితే కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో ఫ్రీసర్వీసెస్ పాసు మాత్రం పెండింగ్లో పెట్టారు. నెల రోజులైన ఈ సమస్యకు పరిష్కారం కల్పించలేదు. దీంతో వెటరన్ జర్నలిస్టులుతీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ మేరకు జర్నలిస్టులు తమ దృష్టికి తీసుకొచ్చిన బస్ పాసులు, సీనియర్ జర్నలిస్టులకురైల్వేలో ప్రయానించేదుకు రాయితీ కల్పించాలని, అలాగే హెల్త్ కార్డులు కూడా మంజూరు చేయాలని, ఇతర రాష్ట్రల్లో మాదిరిగాసీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించగా ఈ సమస్యలను వున్నాతాధికారులు,పార్లమెంటులో కూడా తనగళం వినిపించి రైల్వే ప్రయాణంలో జర్నలిస్టులకు రాయితీపై చర్చిస్తామని యం.పి బైరెడ్డి శబరి హామిఇచ్చారు. ఈ మేరకు సీనియర్ జర్నలిస్టులు ప్రత్యేక అబినందనలు తెలిపారు. యం.పిని కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులుశశిశేఖర్ శర్మ, వెలుగొందారెడ్డి, చింతా సుబ్రమణ్యం, సత్యనారాయణ,గుండం గంగాధరరెడ్డి, దూదేకుల జమాల్ బాష, తదితరులువున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఎర్రమట్టి దందాను అరికట్టండి.

**ఎర్రమట్టి తో అరటి తోట రైతులకు జరుగుతున్న నష్టాన్ని ఆపండి. -సిపిఐ**

**అధికారులకు చేతకాకపోతే అక్రమ ఎర్రమట్టి రవాణాను అడ్డుకుంటాం- సిపిఐ.**





**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 22:** బండి ఆత్మకూరు మండలం నుండి మహానంది మండలానికి తెలుగు గంగ కట్ట ద్వారా ఎర్ర మట్టి టిప్పర్లు రావడం వల్ల వాటి తో వచ్చిన దుమ్ముతో పక్కనే ఉన్న అరటి తోటలు తీవ్రంగా నష్టపోతున్నాయని వెంటనే అధికారులు అక్రమంగా టిప్పర్ల ద్వారా తలుస్తున్న ఎర్రమట్టి రవాణాలను అరికట్టకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు. పి. మురళీధర్ సిపిఐ మండల కార్యదర్శి ఆర్. సామేలు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి రాజు ఒక ప్రకటనలో అధికారులను హెచ్చరించారు. ఈసందర్భంగా సిపిఐనాయకులు మాట్లాడుతూ బండి ఆత్మకూరు మండల పరిధిలోని కడమల కాలువ ప్రాంతం నుంచి మహానంది మండలంలోకి అక్రమంగా ఎర్ర మట్టి తరలింపు ఇదేచ్ఛగా సాగుతున్న వైనం గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న అవినీతికి మునిగిపోయిన అధికారులు చోద్యం చూస్తున్నారని తెలుగు గంగా ప్రధాన కాలువ వెంట అధిక లోడుతో ఎర్రమట్టి తరలిస్తుంటే అరటి రైతులు దుమ్మంతా అరటి తోటకు పొంచి ఉంచి అరటి పంటకు నష్టం వస్తుందని రైతులు మొరపెట్టుకుంటున్నా అధికలోడుతో టిప్పర్ వెళ్తుంటే తెలుగు గంగ కాలువ వెంట ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు రైతులు వ్యతిరేకిస్తున్న వందల సంఖ్యల్లో ఎర్రమట్టి దందా నడుస్తుంటే నిమ్మకు నీరెట్టినట్టు ఉన్న అధికారులు ఇలాగే వాహనాలు అధికలోడుతో తిరిగితే తెలుగు గంగ కాలువ గట్టు బలహీనపడే అవకాశం ఉందని త్వరగా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అక్రమ ఎర్రమట్టి రమణాలను అడ్డుకుంటామని పై నాయకులు అధికారులను హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు. రాజేశ్వరయ్య. శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి లక్ష్మణ్. షేక్ దస్తగిరి బాషా. గురుమూర్తి. తదితరులు తెలిపారు

## వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం...ఆరోగ్యం కాపా డుకుందాం.

**రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణీ. -కె.శ్రీనువాసులు,అధ్యక్షులు**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు ఏప్రిల్ 22:**కర్నూలు నగరం,సమాచార శాఖ భవన్ ప్రాంగ ణంలో బుధవారం రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే.శ్రీనివాసులు ఆధ్వ ర్యంలో వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం...ఆరోగ్యం కాపాడుకుందాం అనే నినాదంతో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్ర మానికి సమాచార శాఖ డిడి కె.జయమ్మ,సెట్కు రు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్,ఏపీజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.హరినాథ్ రెడ్డి,టి.రామ కృష్ణ,మెడిక వర్ హాస్పి టల్ సిబ్బంది జనరల్ మెడిసిన్ డాక్టర్ సరయు రెడ్డి,జి.ఎం.డాక్టర్ మ హేశ్వర్ రెడ్డి,ఎజి ఎం ఎస్.ఖాదర్ బాషా హాజర య్యారు.అనంతరం వారి చేతుల మీదుగా జర్న లిస్ట్ లకు టోపీలు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిక్షణం సమాజంలో జరి గే విశేషాలను సే కరించి,వార్తలుగా ప్రచురణ చే స్తూ ప్రజలను చైత న్యం చేయడంలో జర్నలిస్ట్ ల పాత్ర ప్రధమంగా ఉందన్నారు.వార్తల సేకరణలో జర్నలిస్ట్ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు.ఇలాంటి జర్నలిస్ట్ లను వే సవి తాపం నుండి కాపాడేందుకు తమ తృణసా యంగా రాయల సీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు కె.శ్రీనువాసులు టోపీలు పం పిణి చేయడం అభి నందనీయం అని కొనియా డారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేష న్ నాయకులు భూపాల్,జి ల్లా అధ్యక్షులు,విచ క్షణ దినపత్రిక ఎడిటర్ ర ఘు,రాములు దినపత్రిక ఎడిటర్ చంద్రశేఖర్,జ ర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలి.

**యువతను మాదకద్రవ్యాల నుంచి కాపాడటం ప్రధాన లక్ష్యం.**

**డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తప్పవు.**

**పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు.**

**నంద్యాల జిల్లాను గంజాయి రహితంగా మార్చడమే లక్ష్యం**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఏప్రిల్ 22:**

జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ సమాజంలో గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలు తీవ్రమైన సమస్యలని, వీటిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈగిల్ సెల్ ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ గారు జండా ఊపి ర్యాలీని ప్రారంభించడం జరిగింది. ఈ ర్యాలీ గవర్నమెంట్ హాస్పిటల్ నుండి నూనెపల్లె ఫ్లై ఓవర్ మీదుగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయంలో గల పిజిఆర్ఎస్ హాల్ వరకు కొనసాగింది. అనంతరం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారకుండా కాపాడటం అత్యంత అవసరమన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు మరియు సామాజిక దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ

**గంజాయిపై జీరో టాలరెన్స్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గంజాయి విషయంలో "జీరో టాలరెన్స్" విధానాన్ని పాటించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని అధికారులు తెలిపారు.

జిల్లా నుంచి గంజాయిని పూర్తిగా తుడిచిపెట్టడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గంజాయి రవాణా లేదా విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, అవసరమైతే పి.డి చట్టాన్ని కూడా ప్రయోగిస్తామని హెచ్చరించారు. జిల్లా సరిహద్దులు మరియు అనుమానిత ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేశామని, నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.విద్యార్థులు మరియు యువత పెడదోవ పట్టకుండా, వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ మాదకద్రవ్యాల రహిత క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని కోరారు. గంజాయి మరియు డ్రగ్స్ సమాచారం అందించడానికి లేదా సహాయం కోరడానికి ప్రభుత్వం ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది.హెల్ప్‌లైన్ నంబర్: 1972ఈ సందర్భంగా నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి ఎం.జావళి మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల బారి నుండి రక్షించడం మరియు జిల్లాలో డ్రగ్స్ రవాణా, విక్రయాలను అరికట్టడం. ప్రజల సహకారం: మాదకద్రవ్యాల వినియోగం లేదా అమ్మకాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని ఆమె కోరారు.సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ఈ "ఈగిల్ సెల్" నిరంతరం నిఘా ఉంచుతూ, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి, ఈగల్ టీం అధికారులు, గురురాజా స్కూల్స్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు దస్తగిరి గారు, ప్రభుత్వ వైద్యులు, స్కూల్ మరియు కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వే పనులు వేగవంతం చేయాలి

**కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 22:** జిల్లాలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను నిర్ణీత గడువులోపు సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. రీసర్వేకు సంబంధించిన ఫేజ్1 నుండి ఫేజ్5 వరకు ఉన్న అన్ని దశలను వేగవంతం చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓలు, తహాశీల్దార్లు, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్వే ఎడి శ్రీరామ్ మోహన్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నదని తెలిపారు. భూసంబంధిత వివాదాలు, అడ్డంకులు తక్షణమే పరిష్కరించే విధంగా అన్ని స్థాయిలలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతెనింగ్ ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని, ఫీల్డ్ స్థాయిలో వాస్తవ పరిస్థితులను సరిగ్గా నమోదు చేయడం ద్వారా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె పేర్కొన్నారు. పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, ఎక్కడైనా ఆలస్యం ఉంటే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మార్చి 2027 నాటికి జిల్లాలోని ప్రతి రైతుకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ లక్ష్య సాధనకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత కాలపట్టికలో పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆత్మకూరు డివిజన్‌లోని వెలుగోడు మండలం, డోన్ డివిజన్‌లోని ప్యాపిలి మండలం, బనగానపల్లె డివిజన్‌లోని సంజామల మండలం, నంద్యాల డివిజన్‌లోని ఆళ్లగడ్డ మండలాల్లో రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో పనుల స్థితిగతులను విశ్లేషించి, అవసరమైన సూచనలు జారీ చేశారు. రీసర్వే ప్రక్రియలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## దివ్యాంగుల సమస్యల పైన ఎంపీ బైరెడ్డి శబరికి వినతి పత్రం



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:**

దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సత్రంలో ఉన్న ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీమతి డాక్టర్ బైరెడ్డి శబరి కి వినతిపత్రం అందించడం జరిగినది. ఈ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి మాట్లాడుతూ...

దివ్యాంగులకు గత సంవత్సరంలో జూన్ 26 తేదీన టౌన్ హాల్లో అలింకో సంస్థ వారు దివ్యాంగులకు కావలసిన సహాయ పరికరాల ఎంపిక శిబిరం నిర్వహించడం జరిగిందని, గత సంవత్సరం అక్టోబర్ నెలలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వృద్ధులకు వీల్ చైర్స్, చేతి కర్రలు, వాకర్స్,బెల్టులు ఇవ్వడం జరిగిందని దివ్యాంగులకు ఇంతవరకు కూడా బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇవ్వలేదని దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తొందరగా బ్యాటరీ ట్రై సైకిల్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే ఆన్లైన్లో అప్లై చేసుకున్న దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న మూడు చక్రాల స్కూటర్లు త్వరగా ఇప్పించాలని, తదితర దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు స్పందించిన ఎంపీ శ్రీమతి డాక్టర్ బైరెడ్డి శబరి దివ్యాంగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ సభ్యులు నబి రసూల్, పాణ్యం మండల వికలాంగుల అధ్యక్షులు రవీంద్ర నాయక్, రవికుమార్, అబ్దుల్లా, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాదెండ్ల మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను.

**..మాజీ సీఎం కుటుంబసభ్యులకు నా ప్రగాఢసానుభూతి తెలియచేస్తున్నాను.**

**..భాస్కరరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు, ప్రజలకు విలువైన సేవలు అందించారు.**

**నంద్యాల జనసేన నాయకులు దండు మురళి కృష్ణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 22:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు అనారోగ్యంతో మరణించడం మిక్కిలి బాధాకరం. ఆయన మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్త చేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. భాస్కరరావు కుటుంబసభ్యులు నా ప్రగాడ సానుభూతిని తెలియచేస్తున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో భాస్కరరావు అనేక కీలక పదవులు చేపట్టారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ఆయన ప్రజలకు, రాష్ట్రానికి విలువైన సేవలు అందించారు. భాస్కరరావు రాజకీయ వారసుడిగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు సోదర సమానులు నాదెండ్ల మనోహర్. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మనోహర్.. ఉమ్మడి ఏపీ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు. తండ్రికి తగ్గ వారసుడిగా మనోహర్ భాస్కరరావు పేరుప్రతిష్ఠల్ని నిలబెట్టడం అభినందనీయం." అని జనసేన నాయకులు దండు మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రైతు బజార్‌పై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.

**..రైతులతో ముఖాముఖిడ ధరలు, వసతులపై వివరాల సేకరణ.**

**..స్వయంగా కూరగాయల కొనుగోలు చేసిన కలెక్టర్. -..మార్కెట్‌లో అపరిశుభ్రతపై అసంతృప్తి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 22:** జిల్లాలో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడం, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మార్కెటింగ్ ఏడి, ఎస్టేట్ అధికారులను ఆదేశించారు. బుధవారం టెక్కె మార్కెట్ యార్డ్‌లోని రైతు బజార్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మార్కెట్‌లోని వివిధ దుకాణాలను పరిశీలించి, అక్కడి శుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. రైతులతో నేరుగా ముఖాముఖి మాట్లాడుతూ కూరగాయల ధరలు, అమ్మకాల పరిస్థితి, వారికి అందుతున్న వసతులు, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, వినియోగదారులతో కూడా మాట్లాడి ధరలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల అవసరాలు, రైతుల ప్రయోజనాలను సమన్వయం చేసే విధంగా రైతు బజార్ నిర్వహణ ఉండాలని కలెక్టర్ సూచించారు. తన పర్యటనలో భాగంగా కలెక్టర్ స్వయంగా కూరగాయలు కొనుగోలు చేసి, ధరలు మరియు నాణ్యతను పరిశీలించారు.

మార్కెట్ యార్డ్‌లో కొన్ని ప్రాంతాల్లో కనిపించిన అపరిశుభ్రత, షాపుల నిర్వహణలో లోపాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారం రోజుల్లోగా మార్కెట్‌లోని అన్ని సమస్యలను పరిష్కరించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు బజార్‌లో పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, చెత్త నిర్వహణ, సరైన ధరల ప్రదర్శన వంటి అంశాల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు మరియు వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో రైతు బజార్‌లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, ప్రజలు కూడా శుభ్రత పాటించడంలో సహకరించాలని కలెక్టర్ కోరారు.